1-3-26 RAKSHANA_praja jyothi Medhak.qxd 3/1/2026 7:33 AM Page 1

మన రాజధాని

# రక్షణ

నిజం మా బలం

బాపట్ల | గుంటూరు | పల్నాడు

ఆదివారం 1 మార్చి 2026 పేజీలు : 4

## పరిశ్రమల స్థాపన వేగవంతం

పరిశ్రమల శాఖ, ఏపీఐఐసీ, రెవిన్యూ పలు రకాల ప్రాజెక్ట్ పురోగతి పై వీడియో కాన్ఫరెన్స్ పాల్గొన్న జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా.



వివరాలు 2లో..

## దేశానికి రక్షణ ఇచ్చిన ఊరుకే

# రక్షణ కరువు!

- వాయు -నీటి కాలుష్యంతో చందోలు విలవిల
- 500 మీటర్లలో టెక్స్టైల్స్ పరిశ్రమ... 30 మందికిపైగా మృతి
- రైతుల పొలాలు నాశనం... పిల్లలు, మహిళల్లో రోగాల మోత
- కలెక్టర్ స్పందించాలంటూ గ్రామస్తుల వేడుకోలు






దేశ రక్షణకు సైనికులను అందించిన చందోలు గ్రామం నేడు తన ప్రజల ప్రాణాలకే రక్షణ లేకుండా విలవిలలాడుతోంది. తెనాలికి సమీపంలోని బాపట్ల నియోజకవర్గం చందోలు మేజర్ పంచాయతీలో వాయు, నీటి కాలుష్యం తీవ్ర రూపం దాల్చి ప్రజల ఆరోగ్యాన్ని మింగేస్తోంది. టెక్స్టైల్స్ పరిశ్రమల నుంచి వస్తున్న రసాయనాల ప్రభావంతో క్యాన్సర్, చర్మవ్యాధులు విపరీతంగా పెరిగి గత కొన్నేళ్లలో 30 మందికిపైగా మృతి చెందడం గ్రామాన్ని భయాందోళనలకు గురిచేసింది. అధికారులను వేడుకున్నా స్పందన లేకపోవడంతో ప్రజల్లో ప్రశ్నలు, ఆవేదన మరింత తీవ్రమవుతోంది.

రక్షణ బాపట్ల జిల్లా బ్యూరో





వివరాలు 2లో..

## రక్షణ ప్రభావంతో స్పందించిన ఎమ్మెల్యే



రక్షణ ఎఫెక్ట్

- జిల్లా నడిబొడ్డులో ఎంతో విలువ చేసే ప్రభుత్వ భూమి...
- మూత్రశాలగా మారితే ఎవరి బాధ్యత?
- బాపట్ల గడియార స్తంభం వెనుక
- ప్రభుత్వ స్థలంపై అధికారుల నిర్లక్ష్యం
- 18 నెలలుగా చర్యలు లేవు...
- ఎమ్మెల్యే నరేంద్ర వర్మ దృష్టికి వెళ్లలేదా?

బాపట్ల గుండెల్లో

దుర్గంధ పాలన..

...ల్లా రక్షణ బ్యూరో

జిల్లా కేంద్రం గుండెల్లో ఉన్న ప్రభుత్వ స్థలం పరిస్థితి చూస్తే, బాపట్లలో పరిపాలన ఏ స్థాయిలో ఉందో ఇట్టే అర్థమవు తోంది. గడియార స్తంభం వెనుక భాగాన ఉన్న ఈ స్థలం ఒకప్పుడు గ్రామ సావిడి, ఆ తర్వాత మున్సిపాలిటీ పరిధిలోకి తీసుకున్న

బాపట్ల జిల్లా కేంద్రం నడిబొడ్డులో ఎంతో విలువ చేసే ప్రభుత్వ స్థలం ప్రజా మూత్రశాలగా మారడం పాలనా వైఫల్యానికి ప్రత్యక్ష నిదర్శనంగా మారింది. గడియార స్తంభం వెనుక భాగాన ఉన్న ఈ స్థలం నుంచి రోజు మొత్తం దుర్గంధం వెదజల్లుతున్నా, మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు కన్నెత్తి చూడటం లేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు గడిచినా ఈ భూమిపై స్పష్టమైన నిర్ణయం లేదు. మున్సిపాలిటీకి నెలల వారీగా కొంత ఆదాయం అయినా వచ్చే అవకాశం ఉన్నా, అధికారుల నిర్లక్ష్యమే దీనిని మూత్రశాల కేంద్రంగా మార్చింది.

మిగతా 2లో

### గడియార స్తంభం వెనుక ఖాళీ స్థలంపై తక్షణ చర్యలు



వివరాలు 2లో..

బాపట్ల గుండెల్లో దుర్గంధం అనే రక్షణ దినపత్రిక కథనానికి ఎమ్మెల్యే నరేంద్ర వర్మ తక్షణమే స్పందించారు. గడియార స్తంభం వెనుక ముత్ర శాలగా మారుతున్న ఖాళీ స్థలాన్ని స్వయంగా పరిశీలించి, వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

వినుకొండ మున్సిపల్ సమావేశం

## రాజకీయ రగడ

పదవీకాలం ముగింపు ముందు వైసిపి--చైర్మన్ మధ్య మాటల యుద్ధం



వివరాలు 2లో..

# వినుకొండ మున్సిపల్ సమావేశం రాజకీయ రగడ

మొదటి పేజీ తరువాయి

**వినుకొండ రక్షణ న్యూస్**

పల్నాడు జిల్లాలోని వినుకొండ మున్సిపల్ కౌన్సిల్ సమావేశం రాజకీయ వాతావరణాన్ని మరింత వేడెక్కించింది. మార్చి 17తో కౌన్సిలర్ల పదవీకాలం ముగియనున్న నేపథ్యంలో సమావేశం నిర్వహించగా, వైసిపి కౌన్సిలర్లు పార్టీ కండువాలు ధరించి హాజరుకావడం చర్చనీయాంశమైంది. సమావేశం ప్రారంభం లోనే చైర్మన్ డాక్టర్ దస్తగిరి చేసిన వ్యాఖ్యలతో రాజకీయ ఉద్రిక్తతలు రాజుకున్నాయి. "వైసిపి కండువాలు వేసుకుని వచ్చారు" అన్న వ్యాఖ్యపై వైసిపి సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ, "మీరు కూడా అదే పార్టీ మద్దతుతో చైర్మన్ అయ్యారు కదా" అంటూ ప్రతివాదం చేశారు. దీంతో సమావేశం క్షణాల్లోనే వాగ్వాదంగా మారింది. ఈ ఘటన స్థానిక రాజకీయాల్లో మారుతున్న సమీకరణాలకు సంకేతంగా మారింది. పదవీకాలం ముగింపు దశలో కౌన్సిలర్లు తమ రాజకీయ వైఖరిని స్పష్టంగా వ్యక్తపరచడం గమనార్హం. అభివృద్ధి పనులపై అసంతృప్తి, నిధుల కొరత వంటి అంశాలను వైసిపి సభ్యులు ముందుకు తెచ్చారు. ఐదేళ్లుగా వార్డుల్లో అభివృద్ధి జరగలేదని, ప్రజలు నిలదీస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. చైర్మన్ దస్తగిరి స్పందిస్తూ, రాష్ట్ర ప్రభుత్వం వాటా నిధులు విడుదల చేయకపోవడం వల్లే కేంద్ర నిధులు నిలిచిపోయాయని పేర్కొన్నారు. అభివృద్ధి పనులు ఆగిపోవడానికి ఆర్థిక పరిమితులే కారణమని వివరించారు. వాగ్వాదం తీవ్రరూపం దాల్చడంతో పోలీసులు కౌన్సిల్ హాల్‌లోకి ప్రవేశించి పరిస్థితిని చక్కదిద్దాల్సి వచ్చింది. ఈ సంఘటన వినుకొండ రాజకీయాల్లో కొత్త చర్చలకు దారి తీసింది.

# పరిశ్రమల స్థాపన వేగవంతం

మొదటి పేజీ తరువాయి

**పల్నాడు రక్షణ న్యూస్**

పల్నాడు జిల్లాలో పరిశ్రమల స్థాపన ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా అధికారులను ఆదేశించారు. 2025 భాగస్వామ్య సదస్సులో ఎంఓయూ కుదుర్చుకుని జిల్లాలో పరిశ్రమల నుప్రారంభించేందుకు ముందుకు వచ్చిన కృష్ణ ఆగ్రో ఫ్యూయల్స్ ప్రైవేట్ లిమిటెడ్, మైహోం సిమెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్ (దాచేపల్లి), ఇందన ఎనర్జీస్ ప్రైవేట్ లిమిటెడ్ వంటి భారీ మరియు మెగా ప్రాజెక్టుల పురోగతిపై శనివారం ఉదయం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పరిశ్రమ ల శాఖ, ఏపీఐఐసీ, రెవెన్యూ మరియు సంబంధిత విభాగాల అధికారులతో ప్రాజెక్టుల అమలులో ఉన్న సవ ుస్యలను వివరంగా చర్చించారు. పెట్టుబడిదారులు ఎదుర్కొంటున్న భూ, అనుమతులు మరియు మౌలిక వసతుల అంశాలపై తక్షణ చర్యలు తీసుకుని సమస్యలను వేగంగా పరిష్కరించాలని అధికారులకు స్పష్టం చేశారు. అదేవిధంగా జిల్లాలో ప్రతినియోజకవర్గంలో ఏర్పాటు చేస్తున్న ఎంఎస్ఎంఈ పార్కుల అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించి, ఇంకా భూసేకరణ అవసరమున్న ప్రాంతాల్లో తక్షణ భూమి ఎంపిక ప్రక్రియ పూర్తి చేయాలని ఏపీఐఐసీ మరియు రెవెన్యూ అధికారులకు ఆదేశించారు. జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధి వేగవంతం చేయడం ద్వారా ఉపాధి అవకాశాలు పెంపొందించి, ఆర్థిక వృద్ధిని సాధించడమే ప్రధాన లక్ష్యమని కలెక్టర్ పేర్కొన్నారు.

# దేశానికి రక్షణ ఇచ్చిన ఊరుకే రక్షణ కరువు!

మొదటి పేజీ తరువాయి

**రక్షణ బాపట్ల జిల్లా బ్యూరో**


దేశానికి రక్షణగా నిలిచే సైనికులను ఇచ్చిన ఊరు---ఇవాళ తన ప్రజల ప్రాణాలకే రక్షణ లేకుండా పోయిందని చందోలు గ్రామం రోదిస్తోంది. బాపట్ల నియోజకవర్గంలోని ఈ మేజర్ పంచాయతీ పేరు చెప్పగానే గుర్తుకొచ్చేది దేశభక్తి. ప్రతి కుటుంబం నుంచి ఓ సైనికుడు ఉన్నాడన్న మాట అతిశయోక్తి కాదు. అంతేకాదు, ఉన్నతస్థాయి ప్రభుత్వ ఉద్యోగుల్లోనూ ఈ గ్రామానికి విశేష ప్రాతినిధ్యం ఉంది. జనాభాలో సుమారు 80 శాతం ముస్లిం మైనార్టీలు ఉన్న ఈ గ్రామంలో పదివేలకు పైగా ప్రజలు నివసిస్తున్నారు. కానీ నేడు అదే గ్రామం---కాలుష్యానికి బలైపోయి---ప్రాణభయంతో వణుకుతోంది.

గత కొన్నేళ్లుగా చందోలు గ్రామాన్ని ముసురుకుంటున్నది ఒక్కటే---తీవ్రమైన వాయు, నీటి కాలుష్యం. ఈ కాలుష్య ప్రభావం ఇప్పుడు మానవ జీవితాలపై నేరుగా పడుతోంది. క్యాన్సర్ కేసులు పెరిగాయి. మహిళల్లో బ్రెస్ట్ క్యాన్సర్, పిల్లల్లో చర్మవ్యాధులు, పెద్దల్లో శ్వాసకోశ సమస్యలు సాధారణంగా మారాయి. గ్రామంలో ఏ ఇంట్లో చూసినా ఎవరో ఒకరు దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్న పరిస్థితి. గత కాలంలోనే దాదాపు 30 మంది మహిళలు, పురుషులు క్యాన్సర్‌తో మృత్యువాత పడ్డారని గ్రామస్తులు చెబుతున్నారు. ఇది సంఖ్య కాదు---ప్రతి మరణం ఒక కుటుంబం చీకట్లోకి జారిపోవడమే.

ఈ విపత్తుకు మూలకారణం గ్రామానికి కేవలం 500 మీటర్ల దూరంలో ఉన్న ఎన్ఎస్ఎల్ టెక్స్టైల్స్ పరిశ్రమ అని గ్రామస్తులు ఏకగ్రీవంగా ఆరోపిస్తున్నారు. ఈ పరిశ్రమ నుంచి విడుదలయ్యే రసాయనాలు వాయు కాలుష్యాన్ని పెంచడమే కాదు---నీటి కాలుష్యాన్ని మరింత ప్రమాదకరంగా మార్చాయి. ఒకప్పుడు పచ్చగా ఉండే పంటపొలాలు ఇప్పుడు రంగు మారిపోయాయి. 2,500 ఎకరాలకు పైగా వ్యవసాయ భూములు ఈ పరిశ్రమ ప్రభావంతో దెబ్బతిన్నాయని రైతులు చెబుతున్నారు. పంటకాలువల్లో నీరు ఎరుపు రంగులో ప్రవహిస్తున్న దృశ్యాలు గ్రామస్తులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి.

మొదట్లో పరిశ్రమ నుంచి వచ్చే మలినాలను కాలువల్లోకి వదులుతున్నారని మీడియా కథనాలు వచ్చాయి. అప్పట్లో స్పందన రావడంతో---ఇప్పుడు ఆ రసాయనాలను నేరుగా భూమిలోకి పంపిస్తున్నారన్నది గ్రామస్తుల ఆరోపణ. ఇక్కడే అసలు సమస్య తీవ్రమైంది. భూమిలోకి వెళ్లిన రసాయనాలు భూగర్భ జలాలను కలుషితం చేశాయి. ఫలితంగా గ్రామంలో ఎక్కడ చూసినా నీటి రంగు మారిపోయింది. అదే నీటిని తాగడం, వంటకు వాడడం, పశువులకు ఇవ్వడం వల్ల ప్రజలు అనేక రకాల వ్యాధులకు గురవుతున్నారు. చిన్నపిల్లల చర్మంపై బొబ్బలు, పొడలు, కాలినట్లున్న గాయాలు కనిపించడం సాధారణమైపోయింది.

ఇది కేవలం ఆరోగ్య సమస్య కాదు---ఇది మానవ హక్కుల సమస్య. శుభ్రమైన గాలి, శుభ్రమైన నీరు ప్రతి పౌరుడి ప్రాథమిక హక్కు. అలాంటి హక్కును ఒక పరిశ్రమ ఉల్లంఘిస్తే---ప్రభుత్వ యంత్రాంగం ఏం చేస్తోంది? ఇదే ప్రశ్న చందోలు గ్రామం నేడు అడుగుతోంది. గతంలో ఎన్నోసార్లు మీడియా ఈ విషయాన్ని



వెలుగులోకి తీసుకొచ్చినా---పరిశ్రమపై ఎలాంటి కఠిన చర్యలు కనిపించలేదన్నది గ్రామస్తుల వేదన.

ఇటీవల కొత్తగా బాధ్యతలు స్వీకరించిన జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్‌ను గ్రామ పెద్దలు కలిసి వినతి పత్రం అందించారు. "ఒక్కసారి మా ఊరికి రండి... మా పరిస్థితి మీ కళ్లారా చూడండి" అంటూ వేడుకున్నారు. కానీ ఇప్పటివరకు అధికారులు గ్రామం వైపు కన్నెత్తి చూడలేదని వారు కన్నీటితో చెబుతున్నారు. కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి ఆశ పెట్టుకున్న ప్రజలకు---ఇప్పటికీ స్పందన లేకపోవడం వారి బాధను రెట్టింపు చేస్తోంది.

ఈ పరిస్థితి కొనసాగితే---"రోజుకు ఒక మరణం వచ్చే రోజు దూరం కాదు" అని గ్రామస్తులు భయపడుతున్నారు. ఇది అతిశయోక్తి కాదు---ఇప్పటికే మరణాల సంఖ్య ఆ భయాన్ని నిజం చేస్తోంది. ఈ నేపథ్యంలో ప్రశ్నలు సహజంగా వస్తాయి:

ఈ పరిశ్రమకు ఎలాంటి పర్మిషన్లు ఉన్నాయి?

ఏ రసాయనాలను వాడుతున్నారు?

కాలుష్య నియంత్రణ బోర్డు తనిఖీలు ఎన్ని సార్లు చేశాయి?

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు ఎందుకు లేవు?

ఇవి రాజకీయ ప్రశ్నలు కావు---ఇవి ప్రాణాల ప్రశ్నలు. దేశ రక్షణకు సైనికులను అందించిన గ్రామానికి---ఇవాళ ప్రభుత్వ రక్షణ ఎందుకు అందడం లేదు? ఈ ఊరులోని ప్రజలు ఎవరికి ఇబ్బంది కలిగించలేదు. కానీ ఒక పరిశ్రమ లాభాల కోసం---వేలాది ప్రాణాలు ప్రమాదంలో పడుతున్నాయన్న ఆరోపణలు నిజమైతే---అది క్షమార్హం కాదు.

ఈ కథనం ఆరోపణల కోసమే కాదు---మానవతా విజ్ఞప్తి. జిల్లా యంత్రాంగం, రాష్ట్ర ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు---ఇప్పటికైనా స్పందించాల్సిన అవసరం ఉంది. పరిశ్రమను మూసివేయాలన్న డిమాండ్ కాదు---కాలుష్యాన్ని నియంత్రించాలన్న హక్కైన డిమాండ్. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. కలెక్టర్ వెంటనే గ్రామాన్ని సందర్శించి, వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి, కాలుష్య స్థాయిలపై స్వతంత్ర అధ్యయనం చేయాల్సిన అవసరం ఉంది. పరిశ్రమపై కఠిన పర్యవేక్షణ, అవసరమైతే ఉత్పత్తి నిలిపివేత---ఇవన్నీ ప్రజల ప్రాణాల ముందు చిన్నవే. ప్రజాప్రతినిధులు రాజకీయాలకు అతీతంగా స్పందించాల్సిన సమయం ఇది.

చందోలు గ్రామం అడుగుతున్నది ఒక్కటే---దయ కాదు, న్యాయం. దేశానికి రక్షణ ఇచ్చిన ఈ ఊరికి---ఇప్పుడు ప్రభుత్వం రక్షణ ఇవ్వాలి. లేకపోతే---ఇది ఒక్క గ్రామ కథగా కాకుండా---వ్యవస్థ వైఫల్యానికి మరో మచ్చగా చరిత్రలో మిగిలిపోతుంది.

# రక్షణ ప్రభావంతో స్పందించిన ఎమ్మెల్యే

మొదటి పేజీ తరువాయి

**రక్షణ న్యూస్ బాపట్ల**

బాపట్ల పట్టణ నడిబొడ్డులో గడియార స్తంభం వెనుక ఉన్న ఖాళీ స్థలం మూత్రశాలగా మారి దుర్గంధం వెదజల్లుతోందంటూ రక్షణ దినపత్రికలో ప్రచురితమైన కథనానికి ఎమ్మెల్యే నరేంద్ర వర్మ స్పందించారు. ఆయన ఆ స్థలాన్ని స్వయంగా పరిశీలించి పరిస్థితిని అవగాహన చేసుకున్నారు. అనంతరం రక్షణ పత్రిక ప్రతినిధితో మాట్లాడిన ఎమ్మెల్యే, త్వరలో మున్సిపల్ అధికారులతో చర్చించి ప్రజలకు ఉపయోగపడే విధంగా ఆ స్థలాన్ని అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. అప్పటివరకు అధికారులు వెంటనే చర్యలు తీసుకుని ఆ ప్రాంతాన్ని రక్షించాలని, మళ్లీ మూత్రశాలగా మారకుండా ప్రొటెక్ట్ చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. రక్షణ కథనం ప్రభావంతో ఈ సమస్యపై కదలిక రావడం పై ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు

1-3-26 RAKSHANA_praja jyothi Medhak.qxd 3/1/2026 7:33 AM Page 3



# పేదలకు పెన్షన్ భరోసా

## ఎన్టీఆర్ భరోసా పింఛన్ల కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు

**వేమూరు రక్షణ న్యూస్**

కొల్లూరు గ్రామం గాంధీనగర్ ఎస్‌టి కాలనీ లో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం ప్రజా సందోహం మధ్య ఘనంగా నిర్వహించబడింది. వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు గారు ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు స్వయంగా పింఛన్లు అందజేశారు. పెన్షన్ పంపిణీని స్వయంగా పర్యవేక్షించిన ఎమ్మెల్యే వయోవృద్ధుల ఇళ్లకు వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సేవలు నేరుగా ప్రజల ఇంటి వద్దకే చేరుతున్నాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు. గ్రామాభివృద్ధిలో భాగంగా రూ. 12 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. అదేవిధంగా స్వచ్ భారత్ కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛ రథాన్ని ఆవిష్కరించి, గ్రామంలో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని



పిలుపునిచ్చారు. "సంక్షేమం--అభివృద్ధి--పారిశుధ్యం" లక్ష్యాలతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామ ప్రజలు భారీగా పాల్గొన్నారు.

# సంక్షేమం తోనే పేదల సంతోషం

**పిట్టలవానిపాలెం రక్షణ న్యూస్**

రాష్ట్రవ్యాప్తంగా ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లను ఒక్కరోజు ముందుగానే పంపిణీ చేయడం ద్వారా పేదల జీవనానికి ప్రభుత్వం మరింత భరోసా కల్పించిందని తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ అధికార ప్రతినిధి డాక్టర్ గ్లోరి యానెట్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిర్ణయం, ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ ఆదేశాల మేరకు పిట్టలవానిపాలెం మండలం సంగుపాలెం గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను అర్హులకు ఇంటింటికి వెళ్లి అందజేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సర్వేయర్ వి. సాయి ప్రవీణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ గ్లోరి యానెట్ మాట్లాడుతూ, పేదల జీవనోపాధికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు కీలకమని తెలిపారు. ఒక్కరోజు ముందుగానే పింఛన్ పంపిణీ చేయడం ద్వారా ఉద్యోగులకు సెలవుదినాన్ని కుటుంబంతో గడపే అవకాశం



కల్పించడంతో పాటు, అర్హులైన లబ్ధిదారుల ముఖాల్లో ఆనందం చిగురించిందన్నారు. "ఒకవైపు సంక్షేమం -- మరోవైపు అభివృద్ధి" లక్ష్యాలతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని, పేదల జీవితాల్లో మార్పు తీసుకురావడమే ప్రభుత్వ ధ్యేయమని గ్లోరియా పేర్కొన్నారు.

# మహిళా సాధికారత ర్యాలీ

**నరసరావుపేట రక్షణ న్యూస్**

నరసరావుపేటలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళా పోలీసుల ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ ఘనంగా నిర్వహించారు. వన్ టౌన్ ఎస్సై అరుణ, టూ టౌన్ ఎస్సై బి. యశ్నా నాయకత్వంలో నిర్వహించిన ఈ ర్యాలీ స్థానిక రిలయన్స్ ట్రెండ్స్ నుంచి ప్రారంభమై పల్నాడు రోడ్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా వన్ టౌన్ ఎస్సై అరుణ మాట్లాడుతూ, మహిళలను ఒకరోజు మాత్రమే కాకుండా ప్రతి రోజూ గౌరవించాలని సూచించారు. మహిళలు బలంగా, ధైర్యంగా, దయతో ముందుకు సాగాలని, పురుషులు మహిళలను గౌరవిస్తూ సమాన హక్కులతో చూడాలని పిలుపునిచ్చారు. మహిళలను తల్లి, చెల్లి, భార్య, అత్తగా మాత్రమే కాకుండా సమాజ నిర్మాణంలో కీలక శక్తిగా గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీసులు, పాఠశాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని మహిళా సాధికారత, భద్రతపై




అవగాహన కల్పించారు. మహిళా దినోత్సవ సందేశాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేలా ఈ ర్యాలీ ఆకట్టుకుంది.

# రైతు అభివృద్ధి సబ్సిడీ

### హార్టికల్చర్ సబ్సిడీ ట్రాక్టర్ పంపిణీ చేసిన ఎమ్మెల్యే ఏలూరి...

**పర్చూరు రక్షణ న్యూస్**




కొలలపూడి గ్రామంలో హార్టికల్చర్ శాఖ ఆధ్వర్యంలో సబ్సిడీపై మంజూరైన ట్రాక్టర్‌ను రైతు లబ్ధిదారులకు ఘనంగా అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ట్రాక్టర్‌ను రైతులకు స్వయంగా అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ, రైతుల ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. హార్టికల్చర్ పంటలను ప్రోత్సహించేందుకు యంత్రాలపై సబ్సిడీ అందించడం వల్ల ఖర్చులు తగ్గి, దిగుబడులు పెరుగుతాయని పేర్కొన్నారు. రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబించి లాభదాయకంగా సాగు చేయాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ పథకాలను అర్హులైన ప్రతి రైతు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వ్యవసాయ అధికారులు, రైతులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

# విద్యార్థుల ప్రతిభ ప్రదర్శన



**బాపట్ల రక్షణ న్యూస్**

బాపట్ల జిల్లా బాపట్ల పట్టణం శ్రీనివాస కాలనీలోని శ్రీ చైతన్య స్కూల్లో సైన్స్ డే సందర్భంగా నిర్వహించిన సైన్స్ ఎక్సిబిషన్‌లో బాపట్ల పట్టణ సి.ఐ రాంబాబు పాల్గొన్నారు. విద్యార్థులు రూపొందించిన వివిధ సైన్స్ నమూనాలను ఆసక్తిగా వీక్షించి, వారి ప్రతిభను అభినందించారు. ఈ సందర్భంగా సి.ఐ రాంబాబు మాట్లాడుతూ, విద్యార్థుల్లో విజ్ఞానాసక్తి పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. సైన్స్ పట్ల ఆసక్తి పెంచుకుని, సృజనాత్మకతతో ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. పాఠశాల నిర్వహణ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు విద్యార్థుల కృషిని ప్రశంసిస్తూ, భవిష్యత్తులో మరిన్ని శాస్త్రీయ కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

1-3-26 RAKSHANA_praja jyothi Medhak.qxd 3/1/2026 7:33 AM Page 4



## ప్రత్యేక ప్రజావేదిక

### వెనుకబడిన వర్గాలకు ప్రభుత్వం అండగా ప్రత్యేక గ్రీవెన్స్ ఏర్పాటు



**పల్నాడు రక్షణ న్యూస్**

పల్నాడు జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా జిల్లాలో ఎస్సీ, ఎస్టీ మరియు విభిన్న ప్రతిభావంతుల అభ్యున్నతికి ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ప్రతి నెల నాలుగో శనివారం ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహిస్తూ, వెనుకబడిన వర్గాల సమస్యలకు ప్రాధాన్యతనిస్తున్నారు. ఈ నెల నిర్వహించిన కార్యక్రమంలో సుదూర ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ అర్జీలను సమర్పించి సమస్యలను తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి నారదముని సంబంధిత శాఖలకు ఫిర్యాదులను వెంటనే పంపించి, సమస్యలను తక్షణమే పరిష్కరించాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. నాలుగో శనివారం నిర్వహించిన ఈ వేదికలో సుమారు 35 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా నారదముని మాట్లాడుతూ, జిల్లాలో వెనుకబడిన వర్గాల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించి ప్రతి నెల ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు మరియు సంబంధిత శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.

## దొంగల గ్యాంగ్ అరెస్ట్

### ఇసుప గేట్ల దొంగతనం చేసిన ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసిన వేదులపల్లి పోలీసులు..

**బాపట్ల రక్షణ న్యూస్**



బాపట్ల జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు జిల్లాలో దొంగతనాలపై పోలీసులు కఠిన చర్యలు కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో వేదుళ్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని వడ్డేరపాలెం గ్రామంలో జరిగిన ఇనుప గేట్ల దొంగతనం కేసును పోలీసులు ఛేదించారు. నెల రోజుల క్రితం మారిప్రోలు వెంకటేశ్వరరెడ్డి గారి ఇంటి వెనుక ఉంచిన రెండు ఇనుప గేట్లు దొంగిలించబడిన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విచారణలో ఎ1 సంగీత రంజిత్ కుమార్, ఎ2 ఆసోడి సాయిబాబు రాత్రివేళల్లో గ్రామాల్లో తిరుగుతూ ఇనుప, స్టీల్ వస్తువులను దొంగిలిస్తున్నట్లు గుర్తించారు. దొంగిలించిన వస్తువులను ఎ3 చౌట కుమార్ రాజా కొనుగోలు చేస్తున్నట్లు బయటపడింది. ఎ3 పై గతంలో సారా మరియు దొంగతనం కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఎ1 మరియు ఎ3 నిందితులను అరెస్ట్ చేసి బాపట్ల కోర్టులో హాజరుపరచగా ఈ నెల 12 వరకు రిమాండ్ విధించబడింది. వేదుళ్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగతనాలకు పాల్పడే వారిపై మరియు దొంగసొమ్ము కొనుగోలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ భాగ్యరాజ్ హెచ్చరించారు. ప్రజలు అనుమానాస్పద వ్యక్తులను గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

# మహిళల జీవనోపాధి బలోపేతం

**నరసరావుపేట రక్షణ న్యూస్**



దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వేస్ట్ పిక్కర్లు, హెయిర్ పిక్కర్లు మరియు దళిత, గిరిజన మహిళలకు జీవనోపాధి మెరుగుపరచే లక్ష్యంతో 10 మందికి వివిధ రకాల ఉపాధి యూనిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ సంజనా సింహా ముఖ్య అతిథిగా పాల్గొని లబ్ధిదారులకు యూనిట్లు అందజేశారు. ఈ సందర్భంగా సంజనా సింహా మాట్లాడుతూ, మహిళలు ఆర్థికంగా స్వతంత్రులై తమ సొంత కాళ్లపై నిలబడితేనే సమాజంలో గౌరవంగా, స్వేచ్ఛగా జీవించగలరని తెలిపారు. వేస్ట్ పిక్కర్లు, హెయిర్ పిక్కర్ల సంక్షేమం కోసం డీబీఆర్సీ సంస్థ చేస్తున్న కృషిని అభినందిస్తూ, భవిష్యత్తులో మరింత మంది అవసరమైన వారికిచేయూతనివ్వాలని ఆకాంక్షించారు. డీబీఆర్సీ ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప మాట్లాడుతూ, మెప్మా విభాగంతో ఎంఓయూ, ఎన్ఎస్కేఎఫ్డీసీ, నమస్తే స్కీమ్‌ల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ప్రొఫైలింగ్, వ్యాలిడేషన్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. డిజిటల్ ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సులు నిర్వహిస్తూ, మార్చి 2 నుంచి 8 వరకు మహిళా హక్కుల ప్రచారోద్యమం చేపడుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా ఇన్‌చార్జి రెవెన్యూ అధికారి బి. నారాయణముని, ఏఓ కె. శ్రీనివాసరావు, డీబీఆర్సీ ప్రతినిధులు సాంబయ్య తోకల, గడ్డిపర్తి కోటి రత్నం తదితరులు పాల్గొన్నారు.

# బాలికల భవిష్యత్తుకు అఖండ ఫౌండేషన్ భరోసా

### అఖండ ఫౌండేషన్ ద్వారా పేద విద్యార్థులకు అండగా నిలుస్తున్న విన్నకోట..

**బాపట్ల రక్షణ న్యూస్**



పదవ తరగతి విద్యార్థుల భవిష్యత్తు బలోపేతానికి అఖండ ఫౌండేషన్ ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని జనసేన నాయకుడు, అఖండ ఫౌండేషన్ అధ్యక్షుడు విన్నకోట సురేష్ తెలిపారు. బాపట్ల పట్టణం 28వ వార్డులోని ప్రభుత్వ బాలికల హాస్టల్‌లో పదవ తరగతి విద్యార్థినులకు ఎగ్జామ్ ప్యాడ్స్, పెన్సిల్స్, స్కేల్స్, పెన్నులు పంపిణీ చేశారు. పరీక్షల సమయం దగ్గరపడుతున్న నేపథ్యంలో విద్యార్థినులకు ప్రోత్సాహం అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విన్నకోట సురేష్ మాట్లాడుతూ, పదవ తరగతి విద్యార్థి జీవితంలో కీలక మలుపు అని, క్రమశిక్షణతో చదివి బాపట్లకు రాష్ట్ర స్థాయిలో మంచి పేరు తీసుకురావాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థులు ఏ విషయంలోనూ వెనుకబడకూడదనే ఉద్దేశంతో అఖండ ఫౌండేషన్ ద్వారా విద్య, వైద్య రంగాల్లో నిరుపేదలకు నిరంతర సహాయం అందిస్తున్నామని భరోసా ఇచ్చారు. పరీక్షా సామగ్రి అందుకున్న విద్యార్థినులు ఆనందం వ్యక్తం చేస్తూ, తమకు అండగా నిలుస్తున్న నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నేర నియంత్రణ దిశగా

### ఇంకొల్లు పట్టణ ప్రాంతాల్లో కార్డన్ అండ్ సెర్చ్ లో భాగంగా 26ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు...

**ఇంకొల్లు రక్షణ న్యూస్**



బాపట్ల జిల్లా పోలీస్ శాఖ నేరస్తులపై ప్రత్యేక దృష్టి సారిస్తూ కట్టుదిట్టమైన చర్యలు చేపడుతోంది. జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు ఇకొల్లు సర్కిల్ పరిధిలో మెగా కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. చీరాల డీఎస్పీ ఎం.డి. మోయిన్ సూచనలతో సర్కిల్ ఇన్స్పెక్టర్ వై.వి. రమణయ్య ఆధ్వర్యంలో ఎస్.ఐలు, 45 మంది పోలీసు సిబ్బంది, ఈగల్ బృందంతో కలిసి ఇంకొల్లు పోలీస్ స్టేషన్ పరిధిలోని బంద కాలనీలో విస్తృతంగా సోదాలు చేపట్టారు. అనుమానితుల ఇళ్లను తనిఖీ చేసి, సరైన ధ్రువపత్రాలు లేని 26 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ, గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయాలను అరికట్టడమే ప్రధాన లక్ష్యమన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వాహనదారులు తప్పనిసరిగా తమ వాహనాలకు సంబంధించిన ధ్రువపత్రాలు కలిగి ఉండాలని సూచిస్తూ, యువత గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. జిల్లాలో ఎక్కడైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలు గమనించిన వెంటనే డయల్ 112 లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని తెలిపారు.